## క్లుప్తంగా

### వార్డుల్లో ఫాగింగ్ చేయించండి



ఫాగింగ్ మిషన్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: దోమల నివారణ కోసం వార్డుల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయించాలని శానిటరీ అధికారులు, సెక్రటరీలకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ మల్లికార్జున సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 16 పవర్ స్ప్రేయర్లు, మూడు ఫాగింగ్ మిషన్లు, పారిశుద్ధ్య కార్మికులు పూడికతీత పనులు చేపట్టడానికి అవసరమైన 50 ట్రాలీలు, రక్షణ పరికరాలు, 60 జతల హ్యాండ్ గ్లౌసులు, రేడియమ్ అప్రాన్‌లను సంబంధిత శానిటరీ సెక్రటరీల ద్వారా కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### క్రిస్టియన్ డే వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు

గుంతకల్లుటౌన్: స్థానిక క్రీస్తు సంఘం చర్చిలో సోమవారం ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు పాస్టర్లు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. లోక రక్షకుడు ఏసుక్రీస్తు శిష్యుడైన అపోస్తులుడైన తోమా ద్వారా భారతదేశానికి సువార్త ప్రకటించారని పాస్టర్ గద్దం సురేష్ తెలిపారు. అనంతరం మణిపూర్‌లో శాంతి నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ సలహాదారుడు ఆనంద్‌రెడ్డి, పాస్టర్లు అంబేద్కర్, పారాడేవిడ్, కుమార్, జీపీ ప్రసాద్, జేఎస్ రాజు, దాసరి సురేష్, రాము, సురేష్, కుమార్, సువార్తరాజు, సుందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### బజరంగ్‌దళ్ జిల్లా కో కన్వీనర్‌గా సాంబశివారెడ్డి

తాడిపత్రి అర్బన్: బజరంగ్‌దళ్ జిల్లా కో కన్వీనర్‌గా పల్లేటి సాంబశివారెడ్డి ఎంపికయ్యారు. మదనపల్లిలో జరిగిన విశ్వహిందూ పరిషత్ రాష్ట్రస్థాయి సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు తనను ఎంపిక చేసినట్లు సాంబశివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో బజరంగ్‌దళ్‌ను మరింత బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

### రామలింగేశ్వరునికి అన్నాభిషేకం



అలంకరణలో రామలింగేశ్వరుడు

తాడిపత్రి అర్బన్: స్థానిక బుగ్గ రామలింగేశ్వరుని ఆలయంలో స్వామి వారికి ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా సోమవారం అన్నాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోలిశెట్టి ఆంజనేయులు, ఆలయ అర్చకులు ఎమ్మెల్యే పెద్దారెడ్డికి ఘనస్వాగతం పలికారు. పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. ఉదయం 10 గంటలకు ఆలయంలోని స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు.

### జవానుకు సన్మానం



దేశ సైనికుడు జిలాన్‌ను సన్మానిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

శింగనమల: వాసవీ కళ్యాణ మండపంలో డొంట్ టూ డక్స్ కార్యక్రమం నిర్వహించారు. శింగనమలకు చెందిన జవాను జిలాన్‌కు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వాసవీక్లబ్ సభ్యుడు వీరపుల్లయ్య తెలిపారు. చిన్న పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పేద మహిళలకు చీరలు, రైతులకు రసాయనిక మందులు పంపిణీ చేశారు.

### ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక

పుట్లూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. గత ఏడాది చేపట్టిన రూ.13 కోట్ల పనులపై తనిఖీలు చేపట్టిన సామాజిక తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదిక ద్వారా వివరాలు వెల్లడించారు. జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, అదనపు పీడీ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. రూ.1.29 లక్షల మేరకు అవినీతి జరిగినట్లు వెల్లడైనట్లు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



యాడికి: ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ముఖ్యంగా సాయిబాబా ఆలయంలో సోమవారం ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడాయి.

తాడిపత్రిఅర్బన్/పెద్దపప్పూరు/యాడికి/పెద్దవడుగూరు: తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీదేవి శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అలాగే స్థానిక షిర్డిసాయిబాబా ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే స్థానిక శ్రీదత్తమందిరం, సంజీవనగర్‌లోని వేదగాయత్రి ఆలయంలో పూజలు జరిగాయి. పెద్దపప్పూరు మండలంలోని రామకోటి, చిన్నపప్పూరు, నరసాపురం, ముచ్చుకోట గ్రామాల్లోని సాయినాథుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. చిన్నపప్పూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు బిందెల భాస్కర్ రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. యాడికి మండల వ్యాప్తంగా ఉన్న సాయిబాబా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రాయలచెరువు, నగరూరుల్లోని ఆలయాలత్తో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. పెద్దవడుగూరు మండల పరిధిలోని అప్పేచర్ల, పెద్దవడుగూరు గ్రామాల్లో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. పెద్దవడుగూరులో సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని వైభవంగా ఊరేగించారు.

శింగనమల /గార్లదిన్నె / బుక్కరాయసముద్రం /నార్పల/ పుట్లూరు / యల్లనూరు: శింగనమల చెరువు కట్ట వద్ద నున్న షిర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపూర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. శింగనమల, గోవిందరాయునిపేట, సోదనపల్లి, ఈస్ట్ నరసాపురం, మట్లగొంది, సలకంచెరువు, చిన్నజలాలపురం, వెస్ట్ నరసాపురం, గురుగుంట్ల, శివపురం, సీ బండమీదపల్లి, కొర్రపాడు, రోటరీపురం నుంచి భక్తులు తరలివచ్చారు.

- బుక్కరాయసముద్రం మండలంలోని చెరువు కట్టపై వెలసిన షిర్డీసాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. ఉదయం 6 గంటలకు కాకడ హారతి, 6.30కి అఖండ భజన పంచస్నాన పూజ, 7:30కి అభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి చేశారు. సాయంత్రం స్వామిని ఊరేగించారు.
- గార్లదిన్నె, కల్లూరు, కోటంకతో పాటు పలు గ్రామాల్లో సోమవారం భక్తులు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. షిర్డీ సాయి బాబా ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు చేశారు.

**ప్రబోధాశ్రమంలో...**

తాడిపత్రి: రూరల్ పరిధిలోని చిన్నపొలమడలోని శ్రీప్రబోధాశ్రమంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. శ్రీకృష్ణాశ్రమంలోని త్రైత సిద్ధాంత ఆదికర్త, ప్రబోధానంద సమాధిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.



తాడిపత్రి: బాబా ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

గుంతకల్లుటౌన్: సాయినామస్మరణతో పట్టణంలోని షిర్డీసాయి ఆలయాలు మార్మోగాయి. సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని ఆలూరురోడ్, కసాపురం రోడ్డులో ఉన్న షిర్డీసాయిబాబా ఆలయాల్లో భక్తులు క్యూకట్టారు. సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలూరురోడ్‌లోని సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

గుత్తి:పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు ప్రదానం చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జీకే రాము, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆరె కటికల ఆరాధ్య దైవం సునామ జకినీ మాత ఆలయంలో ఆరె కటికల సంఘం ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుత్తి ఆర్ఎస్‌లోని గౌతమేశ్వరాలయంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు చేపట్టారు. షిరిడీ సాయి బాబా మూలవిరాట్‌కు గుత్తికి చెందిన యాడికి మోడల్ స్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేసే అబ్దుల్ సలామ్ గురు పౌర్ణమిని పురస్కరించుకుని వెండి కిరీటం బహూకరించారు.



గుంతకల్లుటౌన్: షిర్డీసాయినాథుడికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం మూలవిరాట్‌ను పల్లకిలో ఊరేగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ గురు స్వామిని ట్రస్టు సభ్యులు ఘనంగా సత్కరించారు. గురు పౌర్ణమి పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో సేవాలాల్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, కోశాధికారి బాలనాయక్, సభ్యులు పాల్గొన్నారు.

పామిడి: పామిడి టౌన్, రూరల్‌లో మండలవ్యాప్తంగా సాయిబాబా ఆలయాల్లో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పెన్నానదిలోని షిర్డీసాయిబాబా ఆలయం, మెయిన్ బజార్ బాబా ఆలయంలోనూ, వడ్డేవీధిలోని దత్త మహాపీఠంలోనూ, పొగరూరు ఎన్‌హెచ్–44 ఆనుకొని ఉన్న బాబా ఆలయంలో భక్తులు పోటెత్తారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం లిఖిత, మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు, నాయకులు సుధాకర్, ధను, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**శాకంబరి అలంకరణలో పార్వతీ పరమేశ్వరులు**

పామిడి: స్థానిక భోగేశ్వరాలయంలో సోమవారం మూలవిరాట్ శివలింగం, పార్వతీమాతా శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



తాడిపత్రి: అన్నదానం కౌంటర్ల వద్ద బారులు తీరిన భక్తులు



పామిడి: బాబాను దర్శించుకుంటున్న ఏడీసీసీ చైర్‌పర్సన్ లిఖిత



గుత్తి: వెండి కిరీటాన్ని వితరణ చేస్తున్న దృశ్యం




తాడిపత్రి: అలంకరణలో ప్రబోధానంద సమాధి



పామిడిలో మూలవిరాట్ శివలింగం



పామిడిలో పార్వతీ మాతా శాకంబరి అలంకరణ దృశ్యం



బీకేఎస్ చెరువు కట్టపై ప్రత్యేక అలంకరణలో సాయిబాబు



శింగనమలలో అలంకరణలో షిర్డీ సాయిబాబా



పెద్దవడుగూరు: అలంకరణలో సాయిబాబా



గుత్తి రూరల్: అలంకరణలో సంత్ సేవాలాల్ మహారాజ్



గార్లదిన్నెలో ప్రత్యేకంగా అలంకరించిన సాయిబాబా

## ఘనంగా ఉట్ల పరుష

పామిడి: పట్టణంలో రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని ఉట్ల పరుషను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఆయా ఫిర్కాల ఆధ్వర్యంలో వేర్వేరుగా రుక్మిణీ పాండురంగస్వామి సతీసమేత ద్వైయిండీ రథోత్సవ కార్యక్రమాలను భావసార్క్షత్రియ భజన బృందం దిండీ భజనల నడుమ ఊరేగించారు. అనంతరం రెండు బ్రహ్మరథోత్సవాలూ వేర్వేరుగా ఉట్లమాను వద్దకు చేరుకున్నాయి. ఉదయం రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలోనూ, సాయంత్రం డబ్బేదార్ ఫిర్కా ఆధ్వర్యంలో ఉట్ల పరుష చేపట్టారు. ఈసందర్భంగా ఆరెండు ఫిర్కాల నుంచి తెచ్చిన ఉట్లను వేర్వేరుగా ఉట్లమానుకు ధరింపజేశారు.పరుషకు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి జనం తరలిరావడం విశేషం. ఈపరుష పామిడిలోనూ, అలాగే పందరీపురంలోని గోపాలపురంలోనూ ఏకకాలంలో నిర్వహిస్తుండడం గమనార్హం. ఉట్లతేరును పురస్కరించుకొని సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ చాంద్‌బాషా, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ ఆర్‌వీ సునీతబాయి, ఈవో క్రిష్ణయ్య, ఉట్లపరుషను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు, జోజోడే కుమార్, అడ్వకేట్ దత్తు, రాజశేఖర్, జగని రవి, ముకుందా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. వారంరోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు మంగళవారం వసంతోత్సవం కార్యక్రమాలతో ముగుస్తాయి.



పామిడిలో దిండిభజనల నడుమ రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మరథోత్సవ దృశ్యం

## పాఠశాలల బంద్ రేపు

గుంతకల్లుటౌన్: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈ నెల 5న పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ నియోజకవర్గం కన్వీనర్ యశ్వంత్‌కుమార్ తెలిపారు. సోమవారం ఏబీవీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ ద్వారా ప్రభుత్వపాఠశాలల్లో ఖాళీగా ఉన్న 30 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల బంద్ విజయవంతం చేయాలన్నారు. ఏబీవీపీ నాయకులు శివ, తేజ, కృష్ణ పాల్గొన్నారు.

# 'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ పథకాలు

గుంతకల్లుటౌన్: అర్హత ఉన్న ఏ ఒక్కరూ నష్టపోకూడదన్న సంకల్పంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. సోమవారం 29వ వార్డులోని సచివాలయం వద్ద కౌన్సిలర్ జేసీబీ చాంద్‌బాషా అధ్యక్షతన సభను ఏర్పాటు చేశారు. వార్డులో 263 మందికి ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలు,పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ జగనన్న ప్రభుత్వం సంక్షేమ ఫలాలందిస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల కోసం అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండేది కాదని ఆయన గుర్తుచేశారు. కాలనీలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ మల్లికార్జున, వార్డు కౌన్సిలర్ చాంద్‌బాషా, ఆర్‌ఓ నాసిర్‌హుసేన్, సచివాలయాల కన్వీనర్లు జింకల రామాంజనేయులు, ఖలీల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 1వ సచివాలయ పరిధిలోని కౌన్సిలర్లు మెహరున్నీసాబేగం, మాచర్ల సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, అసిస్టెంట్ కమిషనర్ లావణ్య తదితరులు ప్రజలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.



గుంతకల్లుటౌన్: మహిళకు ధ్రువీకరణపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, చైర్‌పర్సన్ భవాని



గుత్తి రూరల్: జక్కలచెరువులో సంక్షేమ పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

**పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం**

గుత్తి రూరల్: పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాటు పడుతున్నారని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జక్కలచెరువు గ్రామంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీలను మొదటి ఏడాదిలోనే 95 శాతం పూర్తి చేసిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, సర్పంచ్ సుహాసిని, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సునీలా యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు ఫరూక్, నాయకులు రాజన్న యాదవ్, గోపాల్, బుగ్గయ్య, ఇబ్రహీం, రంగస్వామి, ఇస్మాయిల్, శ్రీనివాస్‌రెడ్డి, వరదరాజులు, వాల్మీకి శివ, రమణ, నరేష్, క్రషర్ మధు, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఈఓఆర్డీ శివాజీరెడ్డి పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**నేడు గడప గడపకూ మన ప్రభుత్వం**

శింగనమల: మండలంలోని మట్లగొంది గ్రామ పంచాయతీలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది హాజరుకావాలని కోరారు.

**నేడు చిన్నపొలమడలో 'జగనన్న సురక్ష '**

తాడిపత్రి: మండలంలోని చిన్నపొలమడ గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి హాజరవుతారని చెప్పారు.

శింగనమల: మండలంలోని పెరవలి గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష పథకం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ నిర్మలాకుమారి తెలిపారు. కార్యక్రమంలో అర్హులైన వారందరికీ 11 రకాలు ధ్రువీకరణ పత్రాలు అందించనున్నట్లు తెలిపారు.

బుక్కరాయసముద్రం: మండలంలోని కొట్టాపల్లి గ్రామంలోని సచివాలయం–2లో 'జగనన్న సురక్ష' నిర్వహిస్తున్నట్లు మండల ఎంపీడీఓ విజయ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు.

**ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయండి**

పుట్లూరు: ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తక్కళ్లపల్లి గ్రామ సచివాలయంలో తక్కళ్లపల్లి, శనగలగూడూరు గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు.

**ప్రతిభావంతులకు నగదు పురస్కారం**

తాడిపత్రి అర్బన్: పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పెన్షనర్ల అసోషియేషన్ సభ్యులు నగదు పురస్కారాలను అందజేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ బాలికల పాఠశాలలో ప్రతిభ చూపిన వైష్ణవి, రుక్సానకు రూ.8 వేలు, రూ.6 వేలను పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి లక్ష్మి నారాయణరెడ్డి అందించారు.

**డ్రైనేజీ పనుల పరిశీలన**

గుత్తి: పట్టణంలోని 22వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, కౌన్సిలర్ సులోచన పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణం తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, వలంటీర్ రాజా పాల్గొన్నారు.

**సీఐ ఆనందరావుకు ఘన నివాళి**



సీబీ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: పట్టణ సీఐ ఆనందరావు మృతికి సంతాపంగా సోమవారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఫయాజ్‌బాషా ట్రస్టు చైర్మన్ హీరాపురం ఫయాజ్‌బాషా ఆధ్వర్యంలో ముస్లిం, మైనార్టీలు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆనందరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు శివయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ర్యాలీల్లో విశ్రాంత పోలీసు అధికారి శ్రీరాములు, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషావలి, ఉపాధ్యక్షుడు మహబుబ్‌బాషా, నాయకులు చవ్వా రాజశేఖర్, డీవీ.కుమార్, సూర్యప్రభాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**9న ఎగువపల్లిలో కబడ్డీ పోటీలు**

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లిలో ఈనెల 9న గాలెమ్మ జాతర సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. కబడ్డీ పోటీల్లో పాల్గొని టీము సభ్యులు 7వ తేదీ లోపు ఒక్కో టీము రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 9182441632, 9063486242 నంబర్లలో సంప్రదించాలన్నారు.

**మౌలిక సదుపాయాలు కల్పించండి**

పెద్దవడుగూరు: మండలంలోని 25 పంచాయతీల నుంచి పెద్దవడుగూరుకి వచ్చే ఖాతాదారులకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు కత్తుల కొండయ్య పేర్కొన్నారు. నిత్యం ఖాతాదారులు స్థానిక యూనియన్ బ్యాంకుకు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారన్నారు. అయితే ఖాతాదారులకు మౌలిక వసతులు కల్పించడంలో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

**యోగాతో మానసిక ఒత్తిడి దూరం**

బుక్కరాయసముద్రం: యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడి దూరమవుతుందని ఎంపీపీ సునీత తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లకు ఉచిత యోగా శిక్షణా శిబిరం నిర్వహించారు. ఎంపీపీ సునీత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఉమా శంకరమ్మ, యోగా గురువు నరేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అన్నదానం**

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో గురుపౌర్ణమి వేడుకలు సందర్భంగా భక్తులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించా రు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్య క్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బృందావన్ రామాంజనేయులు, రవి, తదితరులు పాల్గొన్నారు.

**చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

శింగనమల: మండలంలోని సీ బండమీదపల్లికి చెందిన చాకల ఆదెప్ప (53) అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఆదెప్ప ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య , ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చితంబరం తెలిపారు.

**ఘర్షణలో ఇద్దరికి గాయాలు**

యాడికి: మండల కేంద్రంలోని శివరామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డికి వేములపాడు రహదారిలో గత కొంత కాలంగా కల్లం దొడ్డి సమస్య ఉంది. ఇరువురు సోమవారం సాయంత్రం కల్లం దొడ్డి వద్ద ఎదురుపడగా మాటామాటా పెరిగి ఘర్షణ పడటంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## పేలిన గ్యాస్ సిలిండర్

తాడిపత్రి: గ్యాస్ సిలిండర్ పేలడంతో మొబైల్ క్యాంటీన్ వాహనం దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని కడప రహదారి పక్కన ఉన్న ఐశ్వర్య విల్లాస్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. మొబైల్ క్యాంటీన్ నిర్వాహకుడు పుల్లన్న రోజూ ఉదయం తన కుమారుడు నాగేంద్రతో కలిసి టిఫిన్ విక్రయిస్తుంటాడు. సోమవారం ఉదయం టిఫిన్ తయారు చేసేందుకు గ్యాస్ స్టవ్‌ను అంటిస్తుండగా, ఒక్కసారిగా పెద్ద శబ్దంతో సిలిండర్ పేలింది. వాహనానికి మంటలు వ్యాపించాయి. మంటల తాకిడికి నాగేంద్రకు గాయాలయ్యాయి. అతడిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారంతో అక్కడకు చేరుకున్న ఫైర్ ఇంజిన్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. మొబైల్ వ్యాను దగ్ధమవడంతో దాదాపు రూ. 5 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు బహిరంగ వేలం

యాడికి: మండలంలోని ఎన్. తిమ్మాపురం గ్రామంలో చౌడేశ్వరీ ఆలయానికి చెందిన 6.38 విస్తీర్ణమున్న భూమిని కౌలుకు ఇచ్చేందుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవదాయ ఈఓ దుర్గాప్రసాద్ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846